

తాళ్లూరు తీర్థానికి భారీ బందోబస్తు

ప్రజాశక్తి - గండేపల్లి


సిబ్బందికి సూచనలిస్తున్న సిఐ సూర్య అప్పారావు

తాళ్లూరులో జరగనున్న జియ్యన్న కళ్యాణం మహోత్సవాల సందర్భంగా భారీ బందోబస్తుతో ఏర్పాట్లు చేసినట్టు జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్, సుమారు 60 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ట్రాఫిక్, దర్శన సమయాల్లో ఆటంకం కలుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి జగ్గంపేట సిఐ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్, జగ్గంపేట ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉపాధి హామీ నిర్వీర్యం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా వ్యతిరేక విధానాలతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బేతంచర్ల ఈశ్వరరావు అధ్యక్షతన సుందరయ్య భవనంలో జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి కెవిస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ నిధులకు సుమారు 20 వేల కోట్ల రూపాయలు తగ్గించి కోత పెట్టిందన్నారు. ఇప్పటికే పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలకు ఈ బడ్జెట్ తగ్గింపు చాలా బాధలకు గురిచేస్తోందన్నారు. మరో ప్రక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినాయని వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వలన కూలీల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. మోడీ అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం ఉందని ఈ లోపుగా బడ్జెట్ను సవరించి రూ.లక్ష కోట్లు కూలీలకు ఈ బడ్జెట్లో కేటాయించి లేకుంటే లక్షలాది మందితో ఢిల్లీలో ఎత్తున సభ నిర్వహించడానికి సన్నాహం చేస్తున్నామన్నారు. మరో వైపు మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎన్నికలలో ఓట్లు కోసం నవరత్నాలు ప్రవేశపెట్టిందని పేదలకు ధైర్యాన్ని ఇచ్చి తలెత్తుకుని బతికేలా ఉపయోగపడే భూ పంపిణీ చేపట్టడం లేదన్నారు. రాజశేఖర్రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా కోనేరు రంగారావు భూ కమిషన్ 35 లక్షల ఎకరాలు భూమి పేదలకు పంచడానికి ఉందని ప్రకటించిందని దాన్ని అమలు చేయడం కోసం జగన్ ప్రభుత్వం దశమ రత్నంగా భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా విభజన హామీలను ఇవ్వకుండా రాష్ట్రాన్ని అభాసుపాలు చేస్తోందని దీనిని ప్రజలందరూ గమనించాలన్నారు. ఏప్రిల్లో జరుగనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తాళ్లరేవు, పిఠాపురం, గొల్లప్రోలు, కాజులూరు, కరప తదితర మండలాలకు చెందిన నాయకులు కూరాకుల సింహాచలం, కె.రాఘవ, యు.బుల్లబ్బాయి, ఆర్.భూలోకం, గోడి భాస్కరరావు, పొట్లంగి వెంకటలక్ష్మి, కె.సత్యనారాయణ, వరలక్ష్మి, మానుపాటి సూర్యనారాయణ, కాలా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో.. ఎప్పటికో..!

- ఆగుతూ...సాగుతూ..
- నత్తనడకన మౌలిక సదుపాయాల కల్పన
- పిఠాపురం, కాకినాడలలో మార్చిలోనైనా అందేనా?
- టిడ్కో గృహ లబ్ధిదారుల ఎదురు చూపులు



పెద్దాపురంలో టిడ్కో సముదాయం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయాలను నిర్మించింది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్ల తర్వాత వీటిని కొన్నిచోట్ల పంపిణీ చేసినప్పటికీ మౌలిక సదుపాయాలను కల్పించలేకపోయింది. నిధుల కొరత, బిల్లులు పెండింగ్ సమస్యతో పనులు ఆగుతూ... సాగుతూ జరుగు తున్నాయి. దీంతో లబ్ధిదారులు అటు అద్దె ఇళ్లలో నివసించలేక, ఇటు టిడ్కో గృహాలకు రుణాలు సమకూర్చిన బ్యాంకులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర సతమతమవుతున్నారు.


పెద్దాపురంలో కొనసాగుతున్న వాటర్ వర్క్స పనులు

ఉమ్మడి జిల్లాలో తొలి,మలి విడతల్లో రాజమహేంద్రవరం, కాకినాడ నగరా లతో పాటు అమలాపురం, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాల్టీల్లో 25,360 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 300 ఎస్ఎఫ్టి ఇళ్లు 11,136, 365 ఎస్ఎఫ్టి ఇళ్లు 2652, 430 ఎస్ఎఫ్టి ఇళ్లు 11,472 ఉన్నాయి. వీటిల్లో 13,856 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ మూడు కేటగిరీల్లో పెద్దాపురం పట్టణంలో 1,728, సామర్ల కోటలో 1,056, బొమ్మూరులో 2,528, మండపేటలో 2,700, అమలా పురంలో 1632, రామచంద్రపురం 1088 ప్లాట్లు కొంత కాలం క్రితం దఫదఫాలుగా లబ్ధిదారులకు అందజేశారు.

● పూర్తికాని మౌలిక సదుపాయాలు

ఇప్పటికే అప్పగించిన గృహ సముదాయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సామర్ల కోటలో రూ.9 కోట్లతో వసతులు కల్పిస్తున్నారు. ఎక్కడ 80 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ లబ్ధిదారులు ఎవరు నివాసం ఉండటం లేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. నేటికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వక నివాసయోగ్యానికి అనుకూలంగా లేవని లబ్ధిదారులు ఆరోపిస్తు న్నారు. పిఠాపురంలో రూ.10.33 కోట్లతో పనులు చేస్తున్నారు. అంతర్గత రోడ్లు, డ్రైయిన్లు, వాటర్ లైన్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ కూడా 80 శాతం పనులు పూర్తయినా మున్సిపల్ ట్యాంక్ నీటి కనెక్షన్లు ఇవ్వలేదు. మండపేటలో రూ.19 కోట్లతో సదుపాయాల కల్పనకు పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

అమలాపురంలో రూ.12.7 కోట్లు, రామచంద్ర పురంలో రూ.9.87 కోట్లతో పనులు చేపట్టగా మురుగునీటి వ్యవస్థ పనులు మధ్యలో నిలిచిపోయాయి. వాటర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాజమండ్రి రూరల్ బొమ్మూరు, తొర్రేడు సముదాయాల వద్ద రూ.15కోట్లతో 90 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. తొర్రేడులో వాటర్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫేజ్ 2లో రాజమండ్రిలో 2,400, మండపేటలో 2064, రామచంద్ర పురంలో 960, పెద్దాపురంలో 1584 ప్లాట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ నాటికి అప్పగించేందుకు కసరత్తులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా మరో రెండు నెలలు అదనంగా సమయం పట్టే అవకాశం ఉంది.

● మార్చికైనా అందేనా?

పిఠాపురంలో ఇప్పటికే 90 శాతం మౌలిక సదుపాయాల పనులు పూర్త యినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చిలో ప్లాట్లను లబ్ధిదారులకు అందజేస్తామని అధికారులు ప్రకటించారు. కాకినాడలో 1152 మందికి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అయితే సదు పాయాల పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రధానంగా నిధుల కొరతతో చేసిన పనులకు బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దాంతో మార్చిలో అందుతాయా లేదా అన్నది ప్రశ్నార్ధకంగా మారింది.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

ప్రజాశక్తి - కాకినాడ

కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఆశ వర్కర్ స్కీమ్ వర్క ర్లందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో జరిగే ఏప్రిల్ 5 చలో ఢిల్లీని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకత్వ శిక్షణా తరగతుల్లో గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి పిలుపునిచ్చారు. ఆశా వర్కర్లకు ఫేస్ రికగ్నిజేషన్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు, అధికారుల వేధింపులు అరికట్టాలని బేబీ రాణి డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ డిమాండ్లను, మోడీ, జగన్ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో విస్తత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో పలివెల వీరబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కలు రాజ్ కుమార్ పలు అంశాలపై ఆశావర్కర్లకు వివరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, నొక్కు లలిత, భారతి, రాజేశ్వరి, నాగలక్ష్మి, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ఆశా వర్కర్ల నాయకత్వ శిక్షణా తరగతుల్లో నాయకులు

తపాలా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు గురువారం కాకినాడ హెడ్ పోస్టాఫీస్ వద్ద తపాలా ఉద్యోగులు, పెన్షనర్లు ఒక రోజు ధర్నా నిర్వహించారు. తపాలా ఉద్యోగుల కాకినాడ డివిజన్ అధ్యక్షుడు ఎన్. సూర్య నారాయణరావు మాట్లాడుతూ 12, 24, 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన టార్గెట్లు వెంటనే నిలిపివేయాలన్నారు. ఇతర డిమాండ్లు తక్షణం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సామర్లకోట బ్రాంచ్ అధ్యక్షుడు, సర్కిల్ ఉపాధ్యక్షుడు పి.వీర్రాజు, కార్యదర్శి సోమరాజు, తుని బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.బాబ్జి, కార్యదర్శి వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఆల్ ఇండియా పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, పెన్షనర్స్ సంఘ నాయకులు తురగా సూర్యారావు మద్దతు పలికారు.


ధర్నా చేస్తున్న తపాల ఉద్యోగులు


సమావేశంలో సిబ్బందితో రమణమ్మ

కాకినాడ రూరల్ సిడిపిఒగా రమణమ్మ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కాకినాడ రూరల్ నూతన సిపిడిఒగా జివి రమణమ్మ గురువారం సామర్లకోట ఐసిడిఎస్ కార్యాలయంలో విధులు చేపట్టారు. రమణమ్మ తుని రూరల్ ప్రాజెక్టు నుండి కొత్తగా ఏర్పాటు చేయనున్న కాకినాడ రూరల్ ప్రాజెక్టు సిడిపిఒగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయం సిబ్బంది, సూపర్ వైజర్లతో సమావేశమయ్యారు. తొలుత కాకినాడలో ఐసిడిఎస్ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణను కలసి వచ్చారు.

ఎంఎల్సి బచ్చుల మృతికి టిడిపి సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎంఎల్సి బచ్చుల అర్జునుడు మృతి పార్టీకి తీరని లోటని పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎంఎల్సి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ పార్లమెంటు అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సంతాపం తెలిపారు. నెల రోజుల క్రితం గుండెపోటుకు గురై విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోమాలోనే ఉన్న ఆయన గురువారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కన్ను మూశారు.

కార్టూ'నిజం'



విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023

- ఆలయాల్లో పర్యాటక అభివృద్ధిపై 4 తేదీల్లో ప్రత్యేక ప్రదర్శన
- అన్నవరం సత్యదేవుని దర్శించుకున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అన్నవరం :

రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖ పట్నంలో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో టెంపుల్ టూరిజానికి సంబంధించి ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవ దాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కార్యమానికి వెళుతూ మార్గ మధ్యంలో గువారం రత్నగిరికి విచ్చేసిన ఆయన శ్రీ సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలలో పర్యాటకంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ఈ సదస్సులో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. అందుకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులు పూర్తి వివరాలతో కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలు తరలివస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 980 కిలోమీటర్ల విస్తీర్ణం గల సువిశాల తీం˘ప్రాంతం ఉండడంతో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్య మంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు పూర్తిగా సహకరించి పరిశ్రమల స్థాపన, ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమ్మిట్ల ద్వారా వేలు, లక్షల కోట్లు పారిశ్రామిక పెట్టుబడులు వచ్చాయంటూ ఆర్భాటంగా ప్రకటించినా వాస్తవంగా వాటిలో ఒక్క శాతం కూడా రాలేదని మంత్రి విమర్శించారు. ఇప్పుడు ప్రచారార్భాటం కాకుండా పూర్తి నిర్ణయా త్మకంగా, ప్రణాళికాబద్ధంగా ఉండేలా సిఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రత్నగిరికి విచ్చేసిన మంత్రికి దేవస్థానం సహాయ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికి దర్శనం అనంతరం ఆశీర్వచనం గావించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, ఇతర అధికారులు, దేవస్థానం పి.ఆర్.ఓ దామెర కృష్ణారావు పాల్గొన్నారు.


అన్నవరం కొండపైకి విచ్చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోతూ పేద మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ బండ ధరను పెంచడం అన్యాయమని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ అన్నారు. గురువారం వరహాలయ్య పేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగాధర్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాల్సిన పాలకులు గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సభలో నాయకులు తాటికొండ వెంకటరత్నం, తాడిశెట్టి గంగాధర్ బైలపూడి రాంబాబు, అనుకుల రమేష్ పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపు అన్యాయం

రెక్కాడితేనేగాని డొక్కాడని ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు అనేకసార్లు పెంచారన్నారు. మళ్లీ గ్యాస్ ధర పెంచడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఖజానా నింపుకోవడం కోసం పేద ప్రజలపై భారాలు వెయ్యడం అన్యాయమన్నారు. వెంటనే పెంచిన రూ.50 గ్యాస్ ధరను తగ్గించాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్య నారాయణ మూర్తి డిమాండ్ చేశారు.

జెవివి ఆధ్వర్యంలో కథల పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

జనవిజ్ఞానవేదిక కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో పిల్లల కథలు-2023 పుస్తకాన్ని ప్రచురించాలని, ఇందు కోసం జిల్లా స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులకు కథల పోటీలు నిర్వహిస్తునట్లు వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో చదివే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు కథా రచన పోటీలో పాల్గొన వచ్చని తెలియజేశారు. ఆనందం, ఆహ్లాదం కలిగించే యుక్తి కథలు, సైన్సు, మానవ సంబంధాలు, నీతి, ఆరోగ్యకరమైన హాస్య కథలకు ప్రాధానం ఉంటుందన్నారు. ఏప్రిల్ 23న పుస్తక దినోత్సవం రోజున జరిగే జిల్లాస్థాయి సభలో కథలు పిల్లల కథలు - 2003 పుస్తకం ఆవిష్కరించనున్నటుట తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తతీయ స్థాయిలో ఉత్తమ కథలుగా ఎంపికైన రచయితలకు బహుమతులు అందజేస్తామని కథల పుస్తకంలో ఎంపికైన రచనలకు బహుమతులు ఇస్తామన్నారు. మార్చి 15వ తేదీ లోగా తమ రచనలను జన విజ్ఞాన వేదిక మండల, జిల్లా స్థాయి నాయకులకు అందజేయా లన్నారు. వివరాలకు కె.ఎం.ఎం.ఆర్.ప్రసాద్ కానీ జిల్లా అధ్యక్షులు ఫోన్-900006098, వి.శ్రీరామారావు వేదిక కాకినాడ జిల్లా ప్రధానకార్యదర్శి ఫోన్-9177798999, గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) విద్యావిభాగం జిల్లా కన్వీనర్ ఫోను నెంబర్ 9963163136 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చట్టంతో వినియోగదారులకు న్యాయం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

డబ్బులు చెల్లించి పొందే సేవలు లేదా కొనుగోలు చేసిన వస్తువులు చికాకు పెడితే వినియోగదారుల హక్కుల కింద ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చని సంఘ ఉపాధ్యక్షులు చదలవాడ హరిబాబు అన్నారు. సర్పవరం జంక్షన్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. సేవల్లో లేదా కొనుగోలు చేసిన వస్తువులలో నాణ్యత లోపించినా, నష్టం కలిగినా పరిహారం పొందవచ్చు అని అన్నారు. బాధితులు న్యాయవాదిని ప్రత్యేకంగా పెట్టుకోవలసిన అవసరం లేదన్నారు. నేరుగా కేసు వేసి వాదించుకోవచ్చు అని అన్నారు. ఈనాడు పాలు, నూనె ఇలా అన్నీ కూడా కల్తీ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . వినియోగదారులు హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 425 0082 నెంబర్ల ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని హరిబాబు తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో హరిబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఎల్పిఓ భమిడిపాటి శివరామకృష్ణమూర్తి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యులు హెచ్ఎస్ రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాస్, పవన్ చైతన్య, బి.నాగేశ్వరరావు, బాలకష్ణ, బుద్ధరాజు సత్య నారాయణ రాజు, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు సమగ్ర కార్యాచరణ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కోర్టుహాల్లో కలెక్టర్ కతికాశుక్లా వేసవి తాగునీటి సరఫరా ప్రణాళికపై గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టిపరిస్థితుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకూడదని మండల స్థాయిలో ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ, ఏపీఈపీడీసీఎల్ ఏఈ, పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారితో ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు తాగునీటి సరఫరాపై సమీక్షించాలని ఆదేశించారు. అదే విధంగా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి మండల, జిల్లా స్థాయిలో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తాళ్లరేవు, పెదపూడి, కాజులూరు, కరప గ్రామీణం తదితర మండలాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ప్రస్తుత అవసరాలకు ఇబ్బందిలేకుండా చూస్తూ కాంప్రెహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, పైప్లైన్ వాటర్ సప్లయ్ పథకాలకు సంబంధించిన 22 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపేలా కార్యాచరణ అమలుచేయాలని, ఈ ప్రక్రియ ఏప్రిల్ 15 నాటికి పూర్తికావాలని సూచించారు. కాలువల మూసివేతకు ముందు చెరువులను 100 శాతం నింపేందుకు ప్రత్యేకంగా నీటి కేటాయింపులు చేసే విషయంలో ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నాటికి తాగునీటి పథకాల మరమ్మతుల పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. బోర్వెల్స్, బోర్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను అమలుచేయాలని సాంబమూర్తి ట్యాంకు, ఆరట్లకట్ట ట్యాంకులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జడ్పి సిఇఒ ఎన్వివి సత్యనారాయణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, కాకినాడ నగరపాలక సంస్థ ఇన్ఛార్జ్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డీపీవో ఆర్.విక్టర్ హాజరయ్యారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫ రెన్స్కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు పథకం కింద చేపట్టిన లే ఔట్లు, గహ నిర్మాణ పనులు రెవెన్యూ అంశాలకు సంబంధించి రీ సర్వే, పీఓఎల్ఆర్, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ, స్పందన అర్జీల పరిష్కారం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ సంకల్పం, ఈ- క్రాప్ బుకింగ్ తదితర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం కింద చేపట్టిన రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. రెండో దశలో జిల్లాలో 87 గ్రామల్లో సర్వే పనులు చేపట్టినట్టు కలెక్టరు తెలిపారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డు (పీఓఎల్ఆర్) రూపొందించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో డీఆర్ఓ కె శ్రీధర్ రెడ్డి, జడ్పి సిఇఒ ఎన్.వి.వి.సత్యనారాయణ, సిపిఒ త్రినాథ్, ఎడిసి సీహెచ్.నాగనరసింహరావు, డిఆర్డిఎ పీడీ కె.శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, ఏడీ సర్వేయర్ బి.లక్ష్మి నారాయణ, పీఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు కాకినాడ, పెద్దాపురం డీఎల్డిఒలు హాజరయ్యారు. **కాకినాడ కార్పొరేషన్** కార్యాలయంలో గురువారం భూముల రీ- సర్వే అంశంపై కమిషనర్) సిహెచ్ నాగ నరసింహారావు సమీక్షిం చారు. సిడిఎంఎ నుంచి 16ఎ ఫార్మేట్ లో వచ్చిన ఆదేశాల ప్రకారం ఆయా అసెస్మెంట్ నెంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నెంబర్ కు అనుసంధానం చేయాలన్నారు. వందేళ్ల తర్వాత జరుగుతున్న ప్రస్తుత రీ సర్వే ఎన్నో భూ వివాదాలకు, సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపి నాగశాస్త్రులు, ఏఈలు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, ఆర్ఐలు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల సేవలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ లైన్స్ క్లబ్ హాలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 1978 బ్యాచ్ కాకినాడ రెడ్ కాన్వెంట్ విద్యార్థులు రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ సభ్యులు మూడు రూపాల్లో సహాయాన్ని అర్హులకు అందిం చారు. 40 మందికి కళ్లజోళ్లు, దుస్తులు, శ్రీహరి అనే వ్యక్తికి రూ.54 వేల విలువచేసే వినికిడి యంత్రాలు, బీసీఇ చదువుతున్న విద్యార్థిని ప్రియాంకకు రూ.20వేల స్కాలర్షిప్లను ట్రస్ట్ సభ్యులు అందించారు. ట్రస్ట్ చైర్మన్ బచ్చు కమల్బాబు మాట్లాడుతూ ట్రస్ట్ ప్రారంభించిన ఆరేళ్ల నుండి ఇప్పటివరకు సుమారు రూ.85 లక్షలతో విద్యా, వైద్య రంగాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందించిన ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎస్.పాపారావు, డాక్టర్ శేషగిరిరావు, బి.శారద, ఎన్.కళ్యాణి, పి శ్రీనివాస్, బోడా ఆనంద్, ఆర్.రమణ మూర్తి, వి.మధుసూదన్, లలిత్ కుమార్ జైన్, టి.పద్మనాభం, వి.సురేష్, వివి.రామ్చరణ్ పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలు, కళ్లజోళ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు



గంజాయి, నిందితులతో పోలీసులు

21 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - మండపేట

మండపేట-ఏడిద రోడ్డులో ఆయిల్ ఫ్యాక్టరీ సమీపంలోని రేకుల షెడ్డు వెనుక 21.623 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోను తీసుకున్నారు. రూరల్ సిఐ శివ గణేష్ గురువారం ఈ వివరాలను మీడియాకు అందించారు. తమకు అందిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ సిబ్బందితో కలిసి మండపేట - ఏడిద ఏడిద రోడ్డులోని ఆయిల్ ఫ్యాక్టరీ సమీపంలోని రేకుల షెడ్డు వెనుక తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిఐ శివ గణేష్, డిప్యూటీ తహశీల్దార్ చింతపెంట సూర్యగాయత్రిపద్మ, విఆర్ఒ దుర్గా ప్రసాద్ దీన్ని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఏడిద సీతానగరం గ్రామానికి చెందిన కసిరెడ్డి పెదకాపు, రావులపాలెం మండలంలోని మోడేకుర్రు గ్రామానికి చెందిన చింతపల్లి సురేష్, రావులపాలేనికి చెందిన బొండాడి రాంబాబులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు మూడు మద్యం బాటిళ్లు, మోటార్ సైకిల్, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి దీనిపై అన్ని కోణా ల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మామిడికుదురు

నగరం 216 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరం గ్రామానికి చెందిన అబెద్ హుస్సేన్(49) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మామిడికుదురు సెంటర్‌లో టీ కొట్టు నిర్వహించుకొనే హుస్సేన్ నగరం వైపు తన ద్విచక్ర వాహనంపై వెళుండగా నగరం నుంచి మామిడికుదురు వస్తున్న ఇద్దరు మైనర్లు వేగంగా వాహనాన్ని నడుపుతూ బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో హుస్సేన్ మతి చెందగా ఇరువురు బాలురు గాయపడ్డారు. బైక్ నడుపుతున్న బాలుడు నగరం గ్రామానికి చెందిన రాయుడు నాగరాజుగా పోలీసులు గుర్తించారు. మతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మతుడి మావయ్య ఇక్బాల్ హుస్సేన్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ షేక్ జానీబాషా తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నకిలీ పోలీసుల అరెస్ట్

ప్రజాశక్తి - పిఠాపురం

క్రైం బ్రాంచ్ పోలీసుల పేరుతో పట్టణంలో వసూళ్లకు పాల్పడిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన కె.వెంకటరమణ ఓ ప్రైవేట్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. అతని నుంచి నెల 14, 24 తేదీల్లో రెండు దఫాలుగా క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని మాయమాటలు చెప్పి రూ.50వేలు దోచుకు వెళ్లారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా పట్టణానికి చెందిన వై.శివ, జివి.చందు, ఎం.కిరణ్, వి.వంశీ కృష్ణలను అరెస్టు చేశామని తెలిపారు. వారి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని తెలిపారు.



సోదాల్లో పాల్గొన్న విజిలెన్స్ అధికారులు

70 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించి 70 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ సిఐ ఆధ్వర్యంలో గురువారం ఈ దాడులు నిర్వహించారు. పట్టణానికి చెందిన గుండా శ్రీనివాసరావు అనే వ్యక్తి స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం వెనుక సందులో ఉన్న ఇంట్లో 40 క్వింటాలు, బ్రాహ్మణ అగ్రహారం వీధిలో 30 క్వింటాలు అక్రమంగా నిల్వ ఉంచినట్టు గుర్తించారు. మొత్తం 70 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. వాటిని దివిలి ఎంఎస్ఎల్ పాయింట్‌కు తరలించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయిస్ అధికారి ఆనంద్, విఆర్ఒ సత్యనారాయణ, విజిలెన్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ప్రజాశక్తి - యానాం

యానాంలో ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్టు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యానాం పట్టణంలోని స్థానిక పాత బస్టాండు, గొలగాబత్తుల వారి వీధిలో ఓ పాన్ షాప్‌లో ప్రభుత్వ నిషేధిత గుట్కాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. ఆ సమాచారం మేరకు వీరభద్ర స్టూడెంట్ కార్నర్ షాప్‌లో తనిఖీలు నిర్వహించా మన్నారు. రూ.3,300 విలువగల పాన్ మసాలా, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వివాహిత ఫిర్యాదు మేరకు భర్త, అత్త తదితరులపై వరకట్నం వేధింపుల కేసును నమోదు చేసినట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన జి.ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదుపై వరకట్నం వేధింపులు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కె. రాజశేఖర్‌తో గతేడాది ఆమెకు వివాహం జరిగిందని, కొన్ని రోజులు సజావుగా కాపురం జరిగిందని ఆమె తెలిపారు. గత కొంత కాలంగా అదనపు కట్నం కావాలంటూ భర్తతో పాటు అత్త, ఇతర కటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సిలిండర్

మోడీ సర్కారు తన నైజాన్ని మరోమారు బయటపెట్టింది. ఎన్నికల వేళ గుబ్బనంగా ఉన్న కేంద్రం... అవి ముగియగానే ప్రజలపై భారాల వడ్డనకు సిద్ధపడింది. అందులో భాగంగా గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై మోయలేని 'బండ' భారం వేసింది. గృహ సిలిండర్లపై రూ.50 పెంచిన బిజెపి సర్కారు వాణిజ్య సిలిండర్లపై ఏకంగా రూ.351 అదనపు భారం మోపింది. సర్కారు నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

గ్యాస్ ధర పెంపుపై సర్వత్రా వ్యతిరేకత
పెరిగిన ఆర్థిక భారంతో సామాన్యుల సతమతం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఆయిల్ కంపెనీలు గ్యాస్ ధరలను మరోసారి పెంచాయి. ఇప్పటికే నిత్యావసరాలను కొనలేని పరిస్థితుల్లో సామాన్యులు అల్లాడుతుంటే, పేద, మధ్య తరగతి కుటుంబాలపై గ్యాస్ బండ మోయలేనంత భారంగా మారింది. గృహ వినియోగ సిలిండర్(14.2కిలోలు)పై రూ.50, వాణిజ్య సిలిండర్(19కిలోలు)పై రూ.351 చొప్పున పెరిగింది. ఫిబ్రవరిలో రూ.1122 ఉండగా, ప్రస్తుతం రూ.1,172కి పెరిగింది. వాణిజ్య సిలెండర్ రూ.1,944 ఉండగా రూ.2,295.50కి చేరింది. ఉమ్మడి జిల్లాలో 16.77లక్షల మంది గ్యాస్ వినియోగదారులున్నారు. వీరిలో గృహ అవసరాల వినియోగదారులు 13లక్షల మంది ఉన్నారు. నెలలో దాదాపు 7.50 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుందని ఒక అంచనా. ఈ నేపథ్యంలో గృహ వినియోగదారులపై నెలకు రూ.3.75 కోట్లు అదనపు భారం పడనుంది. అలాగే వాణిజ్య వినియోగదారులపై రూ.10 కోట్లుపైనే భారం మోపారు. ఈ భారంపై వివిధ వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గ్యాస్ పెంపుపై వారి ఆవేదన వారి మాటల్లోనే...

2019 నుంచి పెరుగుతున్న ధరలు

2019 ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు సిలిండర్ ధర రూ.734 ఉండగా అదే ఏడాది మేలో రూ.740, జూన్‌లో రూ.765 పెరిగింది. ఆగస్టులో రూ.601కి తగ్గింది. మళ్లీ సెప్టెంబర్‌లో రూ.617, నవంబరులో రూ.706, డిసంబరులో రూ.725కి పెంచారు. 2020 జనవరిలో రూ.747, ఫిబ్రవరిలో రూ.839, మార్చిలో రూ.839, ఏప్రిల్‌లో రూ.775కి తగ్గింది. ఇలా 2021 అక్టోబర్ వరకూ రూ.930కి పెరిగింది. తరువాత మరో రూ.50 పెంపుతో గ్యాస్ ధర రూ.980కి చేరింది. 2022 మార్చి నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు ధరలు పెరిగాయి. ఈ 12 నెలల వ్యవధిలో రూ.203 పెరిగింది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1,172కి చేరింది.

సామాన్యులపై భారం తగదు



సామాన్యులపై గ్యాస్ భారం తగదు. బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి క్రమంగా గ్యాస్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసి, ధరలను విపరీతంగా పెంచుతున్నారు. ఇంతటి దారుణం ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. మాలాంటి వృత్తిదారులు పెరుగుతున్న ధరలను తట్టుకోలేకపోతున్నారు.

- తణుకు సత్యనారాయణ, చేతి వృత్తిదారుడు, గండేపల్లి

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



నేను ప్రయివేటు టీచర్‌గా పనిచేస్తున్నాను. పిల్లల ఫీజులు, కుటుంబ,ఆస్పత్రి ఖర్చులు పెరగడంతో ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదు. బంగారం తాకట్టు పెట్టి కుటుంబ పోషణ సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో గ్యాస్ ధర మరోసారి పెంచడంతో భారం మరింత పెరిగింది.

- ఎస్.లలిత, ప్రైవేటు టీచర్, గోడారిగుంట, కాకినాడ

ఇలాగైతే ఎలా బతకాలి....



పప్పులు, ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత అనేకసార్లు గ్యాస్ ధరలను పెంచారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలను తగ్గించాలి.

- ఉలవల తలుపులమ్మ, గృహిణి, సామర్లకోట


చాలీచాలని జీతాలతో కష్టం



ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. వేతనం రూ.10 వేలు వస్తుంది. నెలకు కుటుంబానికి రూ.5 వేలు, వైద్యానికి రూ.1500, వాహనానికి ఖర్చు రూ.4 వేలు అవుతుంది. నిత్యావసరాల ధరలు పెరుగుదలతో అప్పు చేయాల్సి వస్తోంది. మా ఇంట్లో రెండు నెలలకు ఒక సిలిండరు అవసరం. ఖర్చు తగ్గించుకుని నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం బిపిఎల్ కుటుంబాలకు ధరలో మినహాయింపు ఇవ్వాలి.

- జి.లోవరాజు, చిరుద్యోగి, రౌతులపూడి

హోటళ్లు నడుపలేం...



చిన్నపాటి హోటల్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వాణిజ్య సిలిండరు వాడుతున్నాను. ఒక్కసారిగా గ్యాస్ ధర పెంచితే వ్యాపారం ఎలా చేయాలి. హోటల్ లేకపోతే కుటుంబం గడవదు. ఇప్పటికే చక్కెర, పాలు, ఇతర సరుకుల ధరలు పెరిగాయి. టీ ధర పెంచితే వ్యాపారం నడవదు. వ్యాపారం ఎలా జరుగుతుందో అర్థం కావడం లేదు.

- బొదిరెడ్డి శ్రీనివాస్, హోటల్ వ్యాపారి, పిఠాపురం

యానాం వార్తలు



కోతకు గురవుతున్న కనకాలపేట లంక

యానాం నియోజక వర్గంలో కనకాలపేట లంక గోదావరి కోతకు గురవుతోంది. గతేడాది జూలైలో వచ్చిన వరదల తాకిడికి 30 మీటర్ల మేర గోదావరి గట్టు కోతకు గురైంది. ఈ నేపథ్యంలో చేపట్టిన రక్షణ గోడ రివిట్మెంట్ పనుల నాణ్యత లోపం వల్ల పూర్తిగా కూలిపోయింది. గట్టు కోతకు గురవ్వడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఎడిగా పలాష్‌కుమార్‌సన్యాల్

యానాం ప్రభుత్వా సుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ పలాష్ కుమార్‌సన్యాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పుదుచ్చేరి నుంచి యానానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది పలాస్ కుమార్ సైన్యాల్‌కు ఆహ్వానం పలికి ఘనంగా సత్కరించారు.

రైతుల కోసం సొసైటీల ఏర్పాటు

యానాం రైతాంగం కోసం అగ్రికల్చర్ ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ సొసైటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌సిడిసి అసిస్టెంట్ డైరెక్టర్ జయ రామచంద్రన్ తెలిపారు. యానాం బ్లాక్ ఫార్మర్స్, ప్రొడ్యుసర్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. గురువారం స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం బ్లాక్ ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ సొసైటీ లిమిటెడ్ బోర్డు చైర్మన్‌గా మాజేటి సత్యభాస్కర్, వైస్ చైర్మెన్‌గా కోన వెంకట్రావులను ఎన్నుకున్నారు. అనంతరం జయ రామచంద్రన్ మాట్లాడుతూ పంటల ఉత్పత్తుల ద్వారా మంచి ఆదాయాన్ని సమకూర్చుకోవడం, ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, పెట్టుబడులు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి సిబిబిఒ సింగారవేలు, డిడి గణేషన్, వ్యవసాయ అధికారి జోగిరాజు, ఖాన్, రైతులు ఎం.ఆనందరావు, ఎం.సుబ్బారావు, టి.నాగేశ్వరరావు, కె.రామచంద్రరావు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధిప్లాంట్ వద్దంటూ వినతి

మురుగునీటి వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను తమ గ్రామంలో నిర్మించొద్దని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామికి గోపాల్‌నగర్ వాసులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌ను మరో చోటుకు తరలించాలన్నారు. దీనిని కొనసాగిస్తే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్, గాంధీనగర్, బ్రహ్మానంద కాలనీ వాసులు పాల్గొన్నారు.

పార్టీ సూచనల మేరకే ఓటు వేయాలి

ఎంఎల్‌సి ఎన్నికలపై నేతల దిశానిర్దేశం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో పార్టీ సూచనల మేరకు వైసిపి అభ్యర్థులకు ఓటు వేయాలని పలువురు నేతలు సూచించారు. పార్టీ తరపున పోటీలో నిలిచిన వంకా రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాస్ విజయం తథ్యమైనప్పటికీ, ఓటింగ్ పకడ్బందీగా జరగాలన్నారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మార్చి 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో కొవ్వూరులోని హోం మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వైసిపి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, హోం మంత్రి తానేటి వనతి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకులు రాజీవ్‌కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటింగ్‌లో పాల్గొనే జడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ఓటింగ్ విదానంపనై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వైసిపికి స్పష్టమైన ఆధిక్యం ఉన్నా విపక్షాలు పోటీకి దిగి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నాయని విమర్శించారు. రీజినల్ కో-ఆర్డినేటర్ బోసు మాట్లాడుతూ సమాజంలో బడుగు, బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 60 శాతానికి పెంచారన్నారు. శాసన మండలి ఎన్నికల్లో సైతం బలహీన వర్గాల వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికలు జరగనున్న రెండు స్థానాలకు వంకా రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాస్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేశారని, వారి విజయానికి కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమకు సూచించిన మేరకు ఇద్దరు అభ్యర్థులకు తమ తమ తొలి ప్రాధాన్యతా ఓటును వేయాల్సివుంటుందన్నారు.

హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందనడానికి వంకా రవీంద్రనాథ్, కావురు శ్రీనివాస్ ఉదాహరణ అన్నారు. వీరిద్దరూ ఆరంభం నుంచీ పార్టీ అభివద్ధికి అహర్నిశలూ కృషి చేశారన్నారు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న కౌరు శ్రీనివాస్ గతంలో ఆచంట నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా పని చేశారన్నారు. వంకా రవీంద్రనాథ్ 2014 ఎన్నికల్లో నరసాపురం లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీచేయడమే కాక,పార్టీ ప్లీనరీ సమావేశాల్లో రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిశీలనకునిగా పనిచేశారని గుర్తుచేశారు. వీరి సేవలను గుర్తించి ముఖ్యమంత్రి ఎంఎల్‌సి అభ్యర్థులుగా నిలిపారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

వైసిపి జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా మాట్లాడుతూ పార్టీ పటిష్టానికి నిబద్ధతతో కృషి చేసిన చరిత్ర వంకా రవీంద్రనాథ్, కావురు శ్రీనివాస్‌లకు ఉందన్నారు. వీరికి ప్రథమ ప్రాధాన్యతా ఓట్లను వేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేస్తున్న వంకా రవీంద్రనాథ్,కావురు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాపతినిధులంతా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రయారిటీ ఓటింగ్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

'భారత కోకిల'కి ఘన నివాళి

ప్రజాశక్తి-మండపేట, కాకినాడ రూరల్

స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి భారత కోకిల బిరుదాంకితురాలు సరోజిని నాయుడుకు స్థానిక సంగమేశ్వర కాలనీ ఎంపిపి పాఠశాలలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ మాట్లాడారు. సరోజినీ దేవి సమాజానికి, దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం సరోజినీ నాయుడు వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీతో 'భారత కోకిల'గా కీర్తింపబడ్డ ఘనత సరోజినీ నాయుడికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘ వరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి అమలాపురం రూరల్

క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన కనపాల బాబూరావును మండల కో-ఆప్షన్ సభ్యులు ఎం.స్పర్జన్‌రాజు శాలువా కప్పి సత్కరించారు. జగ్గన్నపేటలో బాబూరావును ఆయన గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మైనార్టీసెల్ బలోపేతంపై చర్చించా మన్నారు. ఆయన వెంట మామిడికుదురు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు యార్లగడ్డ పరంజ్యోతి, పవర్ ఆఫ్ పెయిత్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు జోసెఫ్ తాతపూడి ఉన్నారు.

చెరువు పరిశీలన

ప్రజాశక్తి-కొత్తపేట

మండలంలోని బిల్లకుర్రు గ్రామంలో లింగమ్మ చెరువును డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు గురువారం పరిశీలించారు. ఈ చెరువు అభివృద్ధికి రూ.14.61 లక్షలు మంజూరయ్యాయి. చెరువు పూర్తిగా ఎండిన తరువాత ఉపాధి కూలీలతో పనులు మొదలపెడతామని ఆయన తెలిపారు. జిల్లాలో అన్ని అమ్రిత్ సరోవర్ చెరువులను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు, జిల్లా సరోవర్ కో-ఆర్డినేటర్ త్రినాథ్, ఎపిఒ ఎన్.ఆనంద్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ మూర్తి, టిఎలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

మానసిక రోగులకు వైద్య శిబిరం

తాళ్లరేవు : తాళ్లరేవు సిహెచ్‌సిలో మానసిక రుగ్మతతో బాధ పడుతున్న వారి కోసం కాకినాడ ఉమామనో వికాసకేంద్రం, కేరర్ వరల్డ్ వైడ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ ఎస్పి రెడ్డి, మానసిక వైద్యులు కాటన్ పాల్గొని మండలంలోని మానసిక రోగులను పరీక్షించి సూచనలు, సలహాలు మందులను అందించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష, కమ్యూనిటీ మొబలైజర్స్ సీతా, నాగమల్లి, మధుకుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ ముసలయ్య మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందికి చెందిన రేషన్ డీలర్ యడ్ల ముసలయ్య (90) గురువారం ఆకస్మిక మరణం చెందారు. విషయం తెలుసు కున్న సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ముసలయ్య కుమారుడు సుబ్బారావుని పరామర్శించారు. ముసలయ్య నేత్రాలను బాదం బాలకృష్ణ 'ఐ'బ్యాంకకు అందించార.

ఫిజియోథెరపీతో ఉపశమనం

కాకినాడరూరల్ : వివిధ వ్యాయామ వైద్య ఉపకరణాలతో రోగికి చేసే ఫిజియోథెరపీతో ఎముకలు, నరాలు, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగ వైకల్యంతో పాటు క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు, దీర్ఘకాలిక నొప్పులు సైతం తొలగి ఉపశమనం కలుగుతుందని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సంక్షేమ వసతిగృహాల సందర్శన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పట్టణంలోని పలు సంక్షేమ వసతిగృహాలను గురువారం సందర్శించారు. తొలుత కెవి స్టేట్ హోమ్‌ను సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. వసతిగృహంలో ఎలాంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని సూచించారు. మంచి పౌష్టికాహారాన్ని అందించాలని, సౌకర్యాల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూడాలని వసతిగృహ సిబ్బందికి సూచించారు. తరువాత ప్రభుత్వ బాల సదనాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ సమయానికి మంచి ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లలతో కాసేపు మాట్లాడారు. అనారోగ్యాల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, వసతులను పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి ఆహారాన్ని అందిస్తున్నారని సిబ్బందిని, పిల్లలను అడిగి తెలుసుకున్నారు.

వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలి

మండపేట : వాలంటీర్ వ్యవస్థను రద్దు చేసి అర్హులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక టిడిపి ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా, నేడు వాలంటీర్ల ద్వారా జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులపై నమ్మకం లేకనే ఇదంతా చేస్తున్నారన్నారు. వాలంటీర్ల వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. వాలంటీర్లందరూ వైసిపి నాయకులు, కార్యకర్తలు నియమించినవారేన్నారు. వాలంటీర్ వ్యవస్థపై హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు. మండలంలోని ఏడిద గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సుమారు రూ.50లక్షల దోపిడీ చేశాడని, అధికారులు ఇప్పటివరకూ రికవరీ చేయలేదన్నారు. ఇటువంటి ఘటనల ద్వారా ప్రజాధనం వృథా అవుతుందన్నారు.

99 మందిపై రౌడీషీట్‌ల తొలగింపు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద్దాపురం, సామర్లకోట పరిధిలో 99 మందిపై రౌడీషీట్‌లు తొలగించామని పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకు కాకినాడ అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో పలువురిపై గతంలో రౌడీ షీట్ ఓపెన్ చేశామన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి కేసుల్లో లేకుండా గౌరవ ప్రదంగా జీవిస్తున్న వారిని గుర్తించి రౌడీషీట్‌లు తొలగించామన్నారు. పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 88 మందిని, సామర్లకోట పోలిస్ స్టేషన్ పరిధిలో 11మందిపై రౌడీ, సస్పెక్ట్ షీట్‌లను తొలగించామన్నారు. రౌడీ షీట్‌లు తీసివేసిన వారిని గురువారం పెద్దాపురం డిఎస్‌పి కార్యాలయానికి పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ క్రైం డిఎస్‌పి ఎస్.రాంబాబు, పెద్దాపురం సిఐ ఎస్‌కె.అబ్దుల్‌నబీ, సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహం బాధితులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు నగర్‌లో తుఫాన్ బిల్డింగ్ వద్ద గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకష్ణ, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా లన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. షుగర్ బిపి వ్యాధిగ్రస్తులు ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకట్. గ్రామ కమిటీ అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ. తూరంగి వైసిపి నాయకులు అనిశెట్టి రామకృష్ణ, జగడం అప్పారావు, జగడం శ్రీహరి. వేపడ శ్రీను, ప్రశాంత్, గ్రామ ఆశా వర్కర్లు. వాలంటీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సొంతగూటికి 'దేవపాటి'

కొత్తపేట : ఎంపిటిసి మాజీ సభ్యులు దేవపాటి వెంకటేశ్వరరావు సొంతగూటికి చేరారు. తన అనుచరులతో కలిసి మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సమక్షలంలో గురువారం టిడిపిలో చేరారు. బండారు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేవపాటి గతంలో టిడిపి వార్డు సభ్యునిగా, ఎంపిటిసి సభ్యునిగా పనిచేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోరే వారు విజ్ఞతతో ఆలోచించి ముందుకు రావాలన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు అవసరం చాలా ఉందన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు ధర్నాల రామకృష్ణ ఎఎంసి మాజీ చైర్మన్ బండారు సత్తిబాబు, వాడపాలెం సర్పంచ్ బాబు, మాజీ సర్పంచ్ మిద్దె ఆదినారాయణ, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి బీర ఇస్సాక్, నాయకులు పాల్గొన్నారు.

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 226/2022
Between:
మేడపాటి నర్సిరెడ్డి -వాది
AND
వోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి -ప్రతివాది
To:
వోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి, S/o. వెంకటరెడ్డి, 59 సం॥లు, హిందు, వ్యాపారం, డోర్ నెం. 7-235, పిల్లకాలువ దగ్గర, పాత ఊరు, అనపర్తి, అనపర్తి మండలం, అనపర్తి DMC.
-ప్రతివాది
పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 24-3-2023** వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీరు సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
వాది తరపు అడ్వకేట్
అనపర్తి, సెల్: 9849484239

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 206/2022
Between:
1. గుడిమెట్ల గణపతి రెడ్డి
2. గుడిమెట్ల రుద్రారెడ్డి -వాదులు
AND
జిలగం శ్రీనివాసరావు -ప్రతివాది
To:
జిలగం శ్రీనివాసరావు, S/o. సత్యలింగం, 52 సం॥లు, హిందు, వ్యాపారం, డోర్ నెం. 9-89, దేవంగుల వీధి, పందలపాక, బిక్కవోలు మండలం, అనపర్తి JCJC.
-ప్రతివాది
పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 24-3-2023** వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
వాద్లు తరపు అడ్వకేట్
అనపర్తి, సెల్: 9849484239

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 101/2021
Between:
నల్లమిల్లి సతీష్‌కుమార్ రెడ్డి -వాది
AND
వోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి -ప్రతివాది
To:
వోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి, S/o. వెంకటరెడ్డి, 59 సం॥లు, హిందు, వ్యాపారం, డోర్ నెం. 7-235, పిల్లకాలువ దగ్గర, పాత ఊరు, అనపర్తి, అనపర్తి మండలం, అనపర్తి DMC.
-ప్రతివాది
పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 14-3-2023** వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీరు సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
వాది తరపు అడ్వకేట్
అనపర్తి, సెల్: 9849484239